క్లుప్తంగా

రోడ్డు పనుల పరిశీలన

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని శివానగర్ నుంచి చిన్నకంజర్ల వరకు చేపట్టిన రోడ్డు మరమ్మతు పనులను ఎంపీపీ రవీందర్‌గౌడ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంతలమయంగా మారిన రోడ్లకు కంకర క్రషర్‌ల యాజమాన్యాలతో మాట్లాడి మరమ్మతులు చేయిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, రవి, సత్యనారాయణ, రవీందర్ పాల్గొన్నారు.

వావిలాలలో...

మండల పరిధిలోని ఊట్ల గ్రామంలోని పీర్యా చెరువు కట్టపై ఏర్పాటు చేసిన నూతన హైమాస్ట్ లైట్లను ఎంపీపీ రవీందర్‌గౌడ్ ప్రారంభించారు. నాయకులు వెంకటేశ్, శ్రీనివాస్‌గౌడ్, భిక్షపతి, ప్రవీన్, వీరేష్ పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం

జోగిపేట(అందోల్): అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో మంగళవారం కమిషనర్ తిరుపతి కౌన్సిలర్ నాగరాజ్‌తో కలిసి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ 14వ ప్రణాళిక సంఘం నిధుల నుంచి రూ.8లక్షల నిధులతో అండర్ గ్రౌండ్ పనులు చేపట్టినట్లు తెలిపారు. మాజీ కౌన్సిలర్ శరత్‌బాబు, వార్డు ప్రజలు ఊస నాగరాజ్, శ్రీశైలం, పిరగారి ప్రభు, దాకూరి పాపయ్య, మల్లేశం, వెంకటేశం, రాజు యాదగిరి, శ్రీనివాస్, విఠల్, శివకళ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

మునిపల్లి(అందోల్): పౌతి, మోటేషన్‌తో పాటు మీ–సేవ కేంద్రంలో వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల జారీలో ప్రభుత్వ నిబంధనలను పాటించాలని తహసీల్దార్ తెన్‌మొళి అన్నారు. మంగళవారం ధరణిపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులను క్లియర్ చేయాలని సూచించారు. ఆర్‌ఐ రవీందర్‌రావు, కంప్యూటర్ ఆపరేటర్ చందు, జ్యోతి, లింగం, శేశాంక్, చౌహాన్, సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో పింఛన్లు అందించాలి

వట్‌పల్లి(అందోల్): ప్రతినెల 5వ తేదీలోపు పింఛన్లు అందించాలని కోరుతూ వికలాంగులు సంఘం నాయకులు ఎంపీడీఓ శశిప్రభకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పింఛన్లపై ఆధారపడి బతుకుతున్న వికలాంగులు, వృద్ధులకు సమయానికి పింఛన్ రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 5వ తేదీ లోపు రావాల్సిన పింఛన్ డబ్బులు నెలాఖరు వరకు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రతినెల మొదటి వారం లోపు పింఛన్ అందించేవిధంగా చూడాలన్నారు. సంఘం డివిజన్ అధ్యక్షుడు సుభాష్, మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు లీల్‌మియా, ప్రధాన కార్యదర్శి బాబు, కోశాధికారి ఆబేద్, రషీద్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలి

కంది(సంగారెడ్డి): ఉపాధిహామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని సీపీఐ మండల నాయకుడు ఎంఎ ఖాజా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధిహామీ కూలీలకు 6 వారాలు పూర్తయినా కూలిడబ్బులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పనిచేసిన 10 రోజుల్లో డబ్బులు చెల్లించాలని చట్టంలో ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.600 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే స్పందించి బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కల్హేర్(నారాయణఖేడ్): చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. ఎస్‌ఐ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లికి చెందిన శ్రీరాం విఠమ్మ ఈ నెల 20న ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ విఠమ్మ మంగళవారం మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యాసంస్థల బంద్

జహీరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26వ తేదీన విద్యా సంస్థల బంద్ నిర్వహించనున్నట్లు ఏబీవీపీ మెదక్ విభాగ్ హాస్టల్ కన్వీనర్ ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించే విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బంద్‌కు విద్యాసంస్థల బంద్‌కు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో ఏబీవీపీ నాయకులు రమేష్, ఆనంద్, రియాజ్, కమల్, అనిల్ పాల్గొన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి



ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్యే ప్రభాకర్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసినప్పుడే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. ఎంపీపీ తొంట యాదమ్మ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. అనంతరం పలువురు ఎంపీటీసీలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఆరూర్ గ్రామ పరిధిలోని నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు వేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని, గ్రామాల్లో కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలని అధికారులను ఆదేశించారు. వివిధ గ్రామాల పరిధిలోని సమస్యలను ప్రజాప్రతినిధులు ప్రస్తావించారు. పలుశాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. రైతులు లాభదాయకమైన ఆయిల్ పామ్ పంటను సాగుచేయాలని ఉద్యానవన అధికారి స్పందన సూచించారు.

ఎంపీటీసీలకు, ఎమ్మెల్యే సన్మానం

వచ్చే నెల 4తో ఎంపీటీసీల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో వారిని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ఎంపీటీసీలు చేసిన సేవలను అభినందనీయమన్నారు. అనంతరం ఎంపీపీ కార్యాలయ సిబ్బంది ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు,గ్రామాల ప్రత్యేకాధికారులు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

సేంద్రియ సాగుపై అవగాహన

జహీరాబాద్: సేంద్రియ వ్యవసాయంతో అధిక లాభాలు పొందవచ్చని పంటల సేద్య శాస్త్రవేత్త, ఫాం మేనేజర్ శ్రీకాంత్ అన్నారు. జహీరాబాద్‌లోని డీడీఎస్–కేవీకే ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మట్టిని సేకరించే విధానం, మట్టి పరీక్ష ప్రాముఖ్యత, భూసార పరీక్షల కార్డులను అనుసరించి ఎరువులు వేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. వర్మీ కంపోస్టు, నాడెపు కంపోస్టు, పంచగవ్య, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం ఏవిధంగా తయారు చేసుకోవాలనే విధానంపై క్లుప్తంగా వివరించారు. ఉద్యాన శాస్త్రవేత్త శైలజ పంటలపై వచ్చే చీడ పీడల గురించి.. పుల్లటి మజ్జిగ తయారీలపై ప్రదర్శన ద్వారా వాటి ఉపయోగాలను వివరించారు. అనంతరం ఏడీఏ భిక్షపతి శిక్షణ పొందిన రైతులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కేవీకే సిబ్బంది జగన్, లక్ష్మణ్, శ్రీధర్, కంగ్టి మండలానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలపై నిలదీయాలి



మాట్లాడుతున్న నామ రవికిరణ్ గుప్తా

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల పథకాలపై ప్రజలు నిలదీయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్‌గుప్తా అన్నారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఆ తరువాత వాటి ఊసే ఎత్తడం మానేసిందని మండిపడ్డారు. వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులకు 6 వేల పింఛను ఇస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఇచ్చిన రూ.2వేలు కూడా సకాలంలో చెల్లించకపోవడం విచారకరమని విమర్శించారు. జహీరాబాద్ మున్సిపాలిటీలో 4267 మంది వృద్ధులు, 853 మంది వికలాంగులు, 4480 మంది వితంతువులు పింఛన్లు తీసుకుంటున్నారన్నారు. కానీ.. వీరికి ప్రతి నెల డబ్బులు ఇవ్వడంలేదని వాపోయారు. మే నెలకు సంబంధించి పింఛన్లు ఇప్పటివరకూ పంపిణీ చేయలేదని విచారం వ్యక్తం చేశారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేను కాంగ్రెస్‌లో చేర్చుకొనేందుకు చూపుతున్న శ్రద్ధ ప్రజా సంక్షేమంపై చూపాలని హితవు పలికారు. ఇప్పటికైనా పింఛన్లు పెంచి ప్రతి నెల సకాలంలో పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు యాకూబ్, బండి మోహన్, శివప్ప, కనుకుంట్ల శ్రీకాంత్, నరేష్‌రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

రైతాంగానికి అండగా ఉంటాం

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతుల అభిప్రాయ సేకరణ



కల్హేర్: పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

జహీరాబాద్: రైతాంగానికి అండగా ఉంటామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి రైతుభరోసా పథకం విధివిధానాలపై అవగాహన కల్పించారు. మండల పరిధిలోని హుగ్గెల్లి రైతువేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు ఏడీఏ భిక్షపతి, ఆయా మండలాల అధికారులు, రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా పథకం విధివిధానాలను రూపొందించేందుకు ప్రతి రైతువేదిక నుంచి అభిప్రాయాలను సేకరించినట్లు తెలిపారు. సమావేశంలో ఆయా మండల వ్యవసాయశాఖ అధికారులు వెంకటేష్, ప్రవీణ, లావణ్య, వినోద్‌కుమార్, నవీన్‌కుమార్, ఏఈఓలు ప్రదీప్‌కుమార్, శ్రీనివాస్, ప్రవీణ్, భూమేష్, సంపత్, సాయిలు, షరీఫ్, రైతులు మోహన్, రంగారెడ్డి, సంజీవరెడ్డి, కిషన్, జమీర్, జయరాజ్ ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పరిమితి లేకుండా రైతుభరోసా అందజేయాలి

వ్యవసాయ భూమి పరిమితి లేకుండా రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని జహీరాబాద్ మండలంలోని రంజోల్ గ్రామరైతు మోహన్ అభిప్రాయం వ్యక్తంచేశారు. పంటలను సాగు చేసే రైతులకే పథకాన్ని వర్తింపజేయాలని తెలిపారు. పట్టాదారులతో సంబంధం లేకుండా కౌలు రైతులకు కూడా రైతుభరోసా వర్తింపజేయాలన్నారు. రైతులతో సమావేశాలను ఏర్పాటు చేసి అభిప్రాయాలను తీసుకోవడం మంచి నిర్ణయమని హర్షం వ్యక్తం చేశారు.



జహీరాబాద్: రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, అధికారులు



రాయికోడ్: రైతునేస్తం కార్యక్రమానికి హాజరైన రైతులు, అధికారులు

రాయికోడ్ మండల కేంద్రంలో...

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని రైతువేదికలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమానికి రాయికోడ్, మునిపల్లి, వట్‌పల్లి మండలాలకు చెందిన రైతులు అధికసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రైతుభరోసా పథకం అమలుపై రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా రుణమాఫీ చేస్తామని మంత్రి తుమ్మల వివరించారు. సమావేశంలో ఏడీఏ సత్యనారాయణ, ఏఓలు అభినాష్‌వర్మ, శివకుమార్, మహేష్ చౌహాన్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

వానాకాలం పంటల సాగుపై అవగాహన

కల్హేర్(నారాయణఖేడ్): మండల పరిధిలోని సిర్గాపూర్‌లో వానాకాలం పంటల సాగుపై వ్యవసాయశాఖ అధికారులు రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ పంటల సాగు విధానంపై వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ నూతన్ కుమార్, ఏఓలు శశాంక్, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశం పాల్గొన్నారు.

'హానర్' సేవలు అభినందనీయం



హత్నూర: గుల్లమాచునూర్‌లో విద్యాసామగ్రి అందజేస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

హత్నూర(సంగారెడ్డి): హానర్ సేవలు అభినందనీయమని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. మండల పరిధిలోని గుండ్ల మాచునూరు, బొక్కలగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులకు హానర్ పరిశ్రమ ప్రతినిధులు యూనిఫారాలతో పాటు బ్యాగులు నోట్‌బుక్కులను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పరిశ్రమ హెచ్‌ఆర్ మేనేజర్ సుభాష్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి రమణారెడ్డి మాజీ గ్రామ పంచాయతీ కోఆప్షన్ సభ్యుడు శ్రీహరి, నాయకులు శ్రీశైలం, అశోక్, నర్సింగ్‌రాజ్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని వెంకటాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సదాశివపేట పట్టణానికి చెందిన డాక్టర్ బచ్చు శత్రుఘ్నుడు బ్యాగులు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు, ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకులు పోచన్న, హరికాంత్, గడ్డమీది రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.



బ్యాగులను పంపిణీ చేస్తున్న శత్రుఘ్నుడు

జోనల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్



ఉపేందర్‌రెడ్డికి పూలమొక్కను బహూకరిస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): శేరిలింగంపల్లిలోని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో నూతన జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఉపేందర్‌రెడ్డిని రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్ప మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఆయా కాలనీలలో నెలకొన్న సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు.

నీటి సదుపాయం కల్పించండి

జెడ్పీటీసీ లక్ష్మీబాయి రాథోడ్



మరుగుదొడ్ల బ్లాకులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ లక్ష్మీబాయి

నారాయణఖేడ్: జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని మరుగుదొడ్లకు నీటి సదుపాయం కల్పించాలని జెడ్పీటీసీ లక్ష్మీబాయి రాథోడ్ విజ్ఞప్తి చేశారు. ఖేడ్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన బస్తీ–మనబడి పథకం ద్వారా మరుగుదొడ్ల నిర్మాణాలకు మంజూరైన రూ.45లక్షల నిధులతో పనులు చేపట్టగా నేటికీ పూర్తికాలేదన్నారు. అదేవిధంగా నీటి సంపు కోసం జిల్లా పరిషత్ నిధుల ద్వారా రూ.1.50 లక్షలతో చేపట్టిన సంపు నిర్మాణం నిరుపయోగంగా ఉందన్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న బోరు పాడైపోవడంతో మున్సిపాలిటీ ట్యాంకరుతో నీటి సరఫరా చేస్తున్నా సరిపోవడంలేదన్నారు. దీంతో విద్యార్థినులకు ఇబ్బందులు తప్పడంలేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి అంపూర్తిగా నిలిచిపోయిన పనులను పూర్తి చేయించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. జెడ్పీటీసీ వెంట ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యుడు రవీందర్‌నాయక్, ప్రధానోపాధ్యాయుడు యాదవరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐగా లాలునాయక్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐగా లాలునాయక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ట్రాఫిక్ సీఐ శ్రవణ్‌కుమార్ బదిలీపై హైదరాబాద్ ఐజీ కార్యాలయానికి వెళ్లారు. దీంతో సంగారెడ్డి పోలీస్ కంట్రోల్ రూమ్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న లాలునాయక్ పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ అసద్ ఫారుఖ్ బమహెది మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 78.46 శాతం, ద్వితీయ సంవత్సరంలో 95.38 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీసీ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం బీసీ కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు, కాలనీవాసులు ఉన్నారు.

నారాయణనగర్ కాలనీలో అంధకారం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని నారాయణనగర్ కాలనీలో అంధకారం నెలకొంది. కాలనీలో మూడు నెలల నుంచి వీధిదీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతోనే వీధిదీపాల సమస్య తీవ్రంగా ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. కొన్ని స్తంభాలకు బల్బులు కూడా బిగించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి వీధి దీపాలకు మరమ్మతులు చేయించి సమస్యలు పరిష్కరించాలని కాలనీప్రజలు కోరుతున్నారు.

సేవా కార్యక్రమాలతోనే గుర్తింపు

మాజీ లయన్స్ క్లబ్ గవర్నర్ రవీందర్‌గౌడ్



మాట్లాడుతున్న డాక్టర్ రవీందర్‌గౌడ్

జోగిపేట(అందోల్): సేవా కార్యక్రమాలతో ప్రజల్లో గుర్తింపు ఉంటుందని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ డాక్టర్ రవీందర్‌గౌడ్ అన్నారు. జోగిపేట లయన్స్ క్లబ్ 49వ వార్షికోత్సవ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా లయన్స్ క్లబ్ ఎన్నో సేవా కార్యక్రమాలను చేపడుతోందన్నారు. 2024–25 సంవత్సరానికి గాను నూతనంగా ఎన్నికైన కార్యవర్గం సేవా కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. జోగిపేట లయన్స్ క్లబ్‌కు మంచి గుర్తింపు ఉందని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన జోగిపేట అధ్యక్షుడు ఆల్లె శ్రీకాంత్, కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి సంతోష్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ రవిశేఖర్‌రెడ్డితో పాటు కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జగన్మోహన్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, అనంతరెడ్డి, విఠల్‌రావు, వర్మ, సురేందర్‌గౌడ్, శ్రీనివాస్, యశ్వంత్‌రెడ్డి, రంగా సురేష్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సిద్ధివినాయకుడికి ఎమ్మెల్యే పూజలు



ఎమ్మెల్యే సంజీవరెడ్డిని సన్మానిస్తున్న అర్చకుడు

నారాయణఖేడ్: అంగారక సంకట చతుర్థిని పురస్కరించుకొని ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఆయన సోదరుడైన డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం న్యాల్కల్ మండల పరిధిలోని రేజింతల్‌లో ఉన్న సిద్ధివినాయకుడిని ఆలయాన్ని మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారి వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్ పాటిల్, మాజీ ఎంపీటీసీలు పండరిరెడ్డి, రాంచందర్, మాజీ సర్పంచ్ ఈశ్వరప్ప, నియోజకవర్గ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు అవుటి శంకర్ ముదిరాజ్, రాజు పాల్గొన్నారు.

కాలుష్యాన్ని నివారించండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఖాజీపల్లి గ్రామంలో నెలకొన్న కాలుష్య సమస్యను నివారించాలని కోరుతూ జేఏసీ చైర్మన్ దండె రమాకాంత్ ఆధ్వర్యంలో ఖాజీపల్లి ఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ అరుణా, సీఐ గంగాధర్, ఎంపీపీ రవీందర్‌గౌడ్‌లకు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా దండె రమాకాంత్ మాట్లాడుతూ రసాయన పరిశ్రమలు వదులుతున్న కాలుష్యంతో పారిశ్రామికవాడల్లో ఉంటున్న ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలని కోరారు. కాలుష్య నివారణకు గ్రామంలో 500 మంది గ్రామస్తులతో సంతకాలను సేకరించామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం సినీహీరో ప్రభాస్ కూడా తమకు మద్దతు తెలిపారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కుమార్ యాదవ్, భీమా, సురేష్ పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400